


## నల్లాల్లో కలుషితమైన నీటి సరఫరా..ఆందోళనలో ప్రజలు


నల్లా ద్వారా సరఫరా అయిన కలుషితనీరు

**చిన్నకోడూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మాచాపూర్, చిన్నకోడూరు గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటా సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమై రంగు మారిన నీళ్ల రావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అసలే వేసవి కాలం..వేసవి కాలంలో కలుషితమై రంగు మారిన నీరు ఇంటింటా సరఫరా కావడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకొని స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆర్టిజన్ విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో ఆర్టిజన్ విద్యుత్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారంతో 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా టీవీ ఏఈ జెఏసి ఉమ్మడి జిల్లా జాయింట్ సెక్రెటరీ గౌటే భాస్కర్ మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులు గత 9 రోజులు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలో సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆర్టిజన్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యను పరిష్కరించకుండా తొలిగిస్తామని ప్రభుత్వం బెదిరింపులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్టిజన్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని లేనియెడల ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. జెఏసి చైర్మన్ చిట్యాల సుధాకర్,కన్వీనర్ నాగబేరయ్య, నాగేందర్రెడ్డి, భూపాల్రెడ్డి, సుమన్, గౌటి భాస్కర్, మౌనిక,సరిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ డిజిపి స్వాతి లక్రా

## రోడ్డు ప్రమాదాల నివారణ ఉద్యమమే 'అరైవ్-అలైవ్'

### అడిషనల్ డిజిపి స్వాతి లక్రా

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

రోడ్డు ప్రమాదాల నివారణ ఉద్యమమే అరైవ్-అలైవ్ అని అడిషనల్ డీజిపి స్వాతి లక్రా అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారించడానికి చేపట్టిన అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం సీపీ సాధన రష్మీ పెరుమాళ్ ఆధ్వర్యంలో రెడ్డి సంఘం ఫంక్షన్ హాల్లో ఆటో, స్కూల్ బస్ డ్రైవర్లకు ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో వాహన డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, లైసెన్స్, పత్రాలు లేకుండా వాహనాలు నడపకూడదని అన్నారు. రోడ్డు ప్రమాదాల వలన ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం మొత్తం వీధిన పడుతుందన్నారు. రికార్డుల ప్రకారం అత్యధిక మరణాలు రోడ్డు ప్రమాదాల వలనే సంభవిస్తున్నాయన్నారు. రాజీవ్ రహదారివంటి పొడవైన హైవేలపై డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రాణ నష్టాన్ని నివారించవచ్చునని తెలిపారు. ప్రాణాంతక ప్రమాదాల తగ్గింపులో డ్రైవర్ల సహకారం చాలా అవసరమన్నారు. స్కూల్ బస్సు డ్రైవర్లు పిల్లల పట్ల మరింత బాధ్యతగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. మద్యం సేవించి సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్లనే ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయన్నారు. అనంతరం సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కల్పించి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కంటి అద్దాలు, ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్లను అందజేసి డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీపీ సాధన రష్మీ పెరుమాళ్, అదనపు డీసీపీ అడ్మిన్ కుశల్కర్, ఏసీపీ రవీందర్రెడ్డి, సదానందం, నర్సింలు, సుమన్కుమార్, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ఎల్వీప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సమన్వయంతోనే సమస్యలు పరిష్కారం

### -అదనపు కలెక్టర్ ఉషా హారతి


మాట్లాడుతున్న ఉమా హారతి

**మనూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** అధికారులు ప్రజాప్రతినిధులు, ప్రజలతో సమన్వయంతో పనులు చేస్తే సమస్యలు పరిష్కారం అయి అభివృద్ధి సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ ఉషా హారతి అన్నారు. గురువారం మనూర్లోని రైతు వేదికలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమా హారతి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ, పారిశుధ్యం స్థాపనకు, రహదారులు, విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా సమన్వయంతో పనులు చేయాలని అధికారులను సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాములుబాబు, తహసీల్దార్ విష్ణుసాగర్, ఎంపిడిఓ చంద్రశేఖర్, ఎంఈఓ శెట్కార్ రాజశేఖర్, ఐకెపి ఏపిఎం అనంతయ్య, మండల వ్యవసాయ అధికారి మహేష్ చౌహాన్, ఆయా శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్లు, ఉప సర్పంచ్లు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలన్నదే 'అరైవ్ అలైవ్' లక్ష్యం

### రాష్ట్ర అదనపు డిజిపి మురళీధర్ భగవత్

**మునిపల్లి, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలన్నదే అరైవ్ అలైవ్ లక్ష్యం అని రాష్ట్ర అదనపు డీజీపీ మహేష్ మురళీధర్ భగవత్ అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా 'అరైవ్ అలైవ్ – రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ వోక్సెన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోజ్ పంకజ్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా విద్యార్థులు, ఉన్నత పోలీసు అధికారులు, విద్యా రంగ ప్రముఖులు పాల్గొని రోడ్డు భద్రతపై చర్చించారు.దేశవ్యాప్తంగా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రతి ఒక్కరు భాద్యతయుతంగా వ్యవహారించాలన్నారు. రాష్ట్రంలో రోడ్డు మరణాలను తగ్గించడంలో అరైవ్ అలైవ్ ప్రభావం చూపుతోందన్నారు. హెల్మెట్ వినియోగం, అన్ని సీట్లలో సీట్ బెల్ట్ తప్పనిసరి చేయడం, డ్రైవింగ్ సమయంలో అలసట, దృష్టి చెదరింపులను నివారించడం కీలకమన్నారు.గోల్డెన్ అవర్లో సీపీఆర్ వంటి ప్రాణరక్షణ చర్యలపై అవగాహన పెంపొందితే మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు.బాధ్యతాయుత పౌరులే రోడ్డు భద్రతకు మూలం, అని తెలిపారు.సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ రోడ్డు భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.దేశవ్యాప్తంగా రోజుకు సుమారు 370 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. తెలంగాణలో రోజుకు సగటున 18 మంది మరణిస్తున్నారన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహన ప్రమాదాలు, హైవే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. హెల్మెట్ లేకపోవడం, వేగం, నిరక్ష్యం వంటి కారణాలు ప్రధానంగా కనిపిస్తున్నాయన్నారు.అరైవ్ అలైవ్ ద్వారా ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరేలా అవగాహన కల్పించడమే లక్ష్యం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోడ్డు భద్రత ప్రమాణం చేయించడం, విద్యార్థుల అధ్యయన నివేదిక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా భద్రతా సందేశాలను చేరవేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్డు ప్రవర్తనలో మార్పు అవసరాన్ని కూడా ప్రత్యేకంగా చర్చించారు. ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ కుటుంబాలకు చేరుకోవడం అత్యంత ముఖ్యం అన్నారు. అరైవ్ అలైవ్ వంటి కార్యక్రమాలు యువతలో బాధ్యతాభావాన్ని పెంపొందిస్తాయని ఆయన వివరించారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**కొమురవెల్లి, ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ప్రజల, రైతుల అభివృద్ధి, సంక్షేమానికి 6 గ్యారెంటీల అమలు కోసం రూ. వెయ్యి కోట్లకుపైగా ఖర్చు చేసిందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో మండలస్థాయి సభలు నిర్వహించారు. కొమురవెల్లిలోని రైతువేదికలో నిర్వహించిన మండలస్థాయి సభలో జిల్లా కలెక్టర్ పాల్గొన్ని జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల అధికారులు ఆయా శాఖల ద్వారా చేపట్టిన ప్రజా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడారు. ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల పాటు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమాన్ని అమలుచేయడం జరుగుతుందన్నారు. ఈనెల 2న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించగా అదే తరహాలో జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మండల స్థాయి సభలు నిర్వహించమన్నారు. వచ్చే నెలలో నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతివారం ఒక శాఖ థీమ్ను తీసుకొని జూన్ 11 వరకు నిర్వహిస్తామన్నారు. మొదటివారంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్లు క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సంక్షేమ కార్యక్రమాలు, డ్రగ్స్ నియంత్రణ, రైతు సంక్షేమం, విద్యా, క్రీడలు, యువజన, మహిళ సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై నిర్ణీత ప్రణాళిక ప్రకారం 99 రోజులలో నిర్వహిస్తామని తెలిపారు. రైతులు పంట మార్పిడి విధానం, సేంద్రీయ వ్యవసాయం పాటించి అధిక దిగుబడిని సాధించాలని సూచించారు.జిల్లాలో 25 వేల రేషన్కార్డులను మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న ఇందిరమ్మ కుటుంబ జీవితబీమా పథకాన్ని అమలు చేస్తుందని ఈ పథకం ద్వారా రూ.5 లక్షల జీవిత బీమా ప్రతికుటుంబానికి లభిస్తుందని వివరించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపిడివో, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం

### టిజిఐఎసి చైర్మన్ నిర్మలారెడ్డి, జగ్గారెడ్డి

**సదాశివపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త**

పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నాయకులు, అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీమేరకు పట్టణంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందించే ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని టీజీఐఏసీ చైర్మన్ నిర్మలారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ వర్కింగ్ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు త్రాగునీటి సమస్యలపై వివరించారు. జగ్గారెడ్డి సూచన మేరకు పట్టణంలో రాబోయే 50 సంవత్సరాల వరకు నీటి కొరత లేకుండా ఉండేలా రూ.135కోట్ల అంచనా వ్యయంతో కొత్త ప్రణాళిక రూపొందించినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా సింగూర్ డ్యాం నుంచి నేరుగా ఇంటింటికి మంచి నీరు అందించేందుకు ఇంటేక్ వెల్, ఫిల్టర్ బెడ్లు, నిల్వ ట్యాంకులు, కొత్త పైప్లైన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని వెల్లడించారు. ప్రస్తుతం సదాశివపేట పట్టణంలో సుమారు 60 వేల జనాభాకు రోజుకు 21 లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతుందని, కొత్త ప్రణాళిక అమలులోకి వస్తే రోజుకు 52 లక్షల గ్యాలన్ల నీరు అందుబాటులోకి వస్తుందని అధికారులు వివరించారు. ఈ అంశంపై ఈ నెల 17వ తేదీన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించి చర్చించాలని మున్సిపల్ చైర్మన్ అంజమ్మసత్యనారాయణకు జగ్గారెడ్డి సూచించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డుల ప్రజలు, అన్ని పార్టీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని, అలాగే ఎంపీ, ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కలిసి వారి సూచనలు తీసుకోవాలన్నారు. ఈ నెల 19వ తేదీన అన్ని అభిప్రాయాలను సమీక్షించి తుది నివేదికను తనకు లేదా నిర్మలారెడ్డికి అందజేయాలని జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిని కలిసి నివేదికను సమర్పించి స్కీంకు ఆమోదం తీసుకురావాలని తెలిపారు. ఆమోదం వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి రెండు సంవత్సరాల్లో ప్రాజెక్టును పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తామని అన్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు పేదలకు ప్లాట్లు కేటాయింపు, ప్రతి వార్డుకు రూ.8 కోట్ల అభివృద్ధి నిధులపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు, నాయకులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగ్గారెడ్డి


కేతకి సంగమేశ్వర ఆలయాన్ని దర్శింకుంటున్న అదనపు కలెక్టర్ పాండు

## కేతకి సంగమేశ్వరస్వామిని దర్శించుకున్న అదనపు కలెక్టర్

**ఝరాసంగం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం అదనపు కలెక్టర్ పాండు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అదనపు కలెక్టర్ పాండును ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా పాండు ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పాదప్రక్షాళన చేసుకుని ఆలయంలో గర్భగుడిలో ఆలయ అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అదనపు కలెక్టర్కు ఆశీర్వచనాలు చేసి శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రాజు, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకలు ఉదయ్ శంకర్ పాటిల్, కేతకి ఆలయ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, ఆర్ఐలు రామారావు, సాయి కుమార్, వార్డు సభ్యులు నాగేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలి

### సిడిఎంఎ శ్రీదేవికి మున్సిపల్ చైర్మన్ యూనూస్ వినతి

**జహీరాబాద్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):**

జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనూస్ కోరారు. గురువారం హైదరాబాద్లోని మున్సిపల్ పరిపాలన సంచాలకుల కార్యాలయంలో కమిషనర్ టి.కె. శ్రీదేవిని ఆయన వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి వినతిపత్రాన్ని అందజేశారు. యూఐడీఎఫ్ పథకం కింద జహీరాబాద్ మున్సిపాలిటీలో 65 రకాల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం గతంలోనే రూ.18.70 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఇప్పటికే 16 పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ నిధుల విడుదల, చెల్లింపు విధానంపై స్పష్టత లేకపోవడంతో కాంట్రాక్ట్ ఏజెన్సీలు పనులు ప్రారంభించడానికి వెనుకాడుతున్నాయని చైర్మన్ వివరించారు.

నిధుల విడుదల, చెల్లింపు యంత్రాంగంపై తక్షణమే స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని, తద్వారా నిలిచిపోయిన అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. పనులు ఆలస్యం కావడం వల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.దీనిపై స్పందించిన సీడీఎంఏ శ్రీదేవి నిధుల విడుదల, పనుల పురోగతిపై సానుకూలంగా స్పందించినట్లు చైర్మన్ యూనూస్ తెలిపారు.

## మెదక్ జిల్లాను జీరో యాక్సిడెంట్ జోన్గా మారుద్దాం

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతిమాసింగ్

**మెదక్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మెదక్ జిల్లాను రోడ్డు ప్రమాదాలులేని జీరో యాక్సిడెంట్ జోన్గా తీర్చిదిద్దడమే లక్ష్యమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం కింద పోలీస్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మెదక్లోని బాలాజీ ఫంక్షన్ హాల్లో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన డ్రైవర్ల కోసం ఏర్పాటుచేసిన కంటి వైద్యశిబిరాన్ని కలెక్టర్, ఎస్పీ డి.వి. శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. వయసు పెరిగేకొద్దీ వచ్చే కంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని, చూపు స్పష్టంగాఉన్నప్పుడే ప్రయాణం సురక్షితంగా ఉంటుందని డ్రైవర్లకు ఆమె సూచించారు. మానవ తప్పిదాల వల్లే జిల్లాలో అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని, విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోవడంపై కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఆదేశించారు. ప్రమాద సమయాల్లో తక్షణమే స్పందించి ప్రథమ చికిత్స అందించడంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఇందులో భాగంగానే సర్జన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ ద్వారా ప్రాణదానం చేసే విధానంపై ప్రత్యక్షంగా విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అతివేగం, అజాగ్రత్త, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలే మరణాలకు ప్రధాన కారణం అవుతున్నాయని పేర్కొన్నారు. ఇకపై ట్రాఫిక్ నియమాలను పాటించని వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతిరాజు మాట్లాడుతూ, వాహనదారులు తమ గమ్యాన్ని చేరడం ఎంత ముఖ్యమో, క్షేమంగా తిరిగి ఇంటికి రావడం కూడా అంతే ముఖ్యమని గుర్తు చేశారు. యువత ప్రమాదాల బారిన పడితే ఆ కుటుంబానికి కలిగే శోకం వర్ణనాతీతమని పేర్కొంటూ కవితల రూపంలో అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులతో కలిసి రోడ్డు భద్రతపై సంతకాల సేకరణ (సిగ్నేచర్ క్యాంపెయిన్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా రవాణా అధికారి వెంకట స్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, డిఎస్పీ ప్రసన్న కుమార్ వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

## విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

### -స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

**జగదేవ్పూర్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని సిద్దిపేట జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైత వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండలస్థాయి సమావేశం మండల ప్రత్యేకాధికారి సుదర్శన్, ఎంపిడివో పి.వేణుగోపాల్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాలయాలను అన్ని హంగులతో తీర్చిదిద్దేందుకు విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారాన్ని అందజేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల ప్రణాళికను రూపొందించుకొని గ్రామాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టారని చెప్పారు. సమావేశంలో ప్రజాప్రతినిధులతో కలిసి సమస్యలపై చర్చించి తీర్మానాన్ని ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు.

**రైతులు పంట మార్పిడి చేయాలి...**

రైతులు పంటల మార్పిడి చేసినట్లయితే భూమి ఆరోగ్యం మెరుగుపడటంతోపాటు లాభాలు పొందవచ్చని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. దేశంలో అత్యధికంగా ఫామాయిల్ను దిగుమతి చేసుకుంటున్నామని, దానిని తగ్గించుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫామాయిల్ సాగుకు ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సిద్దిపేట జిల్లాలోని నర్మెట్టలో 350 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫామాయిల్ ఫ్యాక్టరీని ప్రారంభించారని, ఈ ప్రాంత ఆయిల్ఫామ్ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అంతకుముందు ఎంపిడివో పి.వేణుగోపాల్ రెడ్డి, మండల ప్రత్యేకాధికారి సుదర్శన్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృతస్థాయి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 99 రోజుల ప్రణాళికలో భాగంగా స్థానిక సమస్యలు, అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించడం జరిగిందన్నారు. గజ్వేల్ ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, సన్నాలకు బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్, మహిళా శక్తి బ్యాంక్ లింకేజ్, వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులను అందించడం జరుగుతుందన్నారు. అంతకుముందు మండల వ్యవసాయాధికారి వసంతరావు వ్యవసాయ శాఖ సంబంధిత పథకాల గురించి వివరించగా హౌసింగ్ ఏఈ విశాఖ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నిర్మాణాల గురించి, రెవెన్యూ, విద్యుత్ వివిధ శాఖల అధికారులు తాము అందిస్తున్న సేవల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ నిర్మళ, పంచాయతీ అధికారి ఖాజా మొయినొద్దీన్, స్థానిక ఎస్ఐ కృష్ణారెడ్డి, ఆర్ఐ, ఎంపిడివో కార్యాలయ సిబ్బంది సూపరింటెండెంట్ ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్లు పనగట్ల శ్రీనివాస్గౌడ్, రాచమల్ల ఎల్లేష్, కాశమైన మహేష్, స్రవంతి, వెంకటేశం, విద్యాధర్, బాలయ్య, కుమార్, నాయకులు సురేష్, అంగన్వాడీ టీచర్లు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

## గుండారంలో కొండ చిలువ

**బెజ్జంకి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుండారం గ్రామంలో గురువారం ఉదయం కొండచిలువ కనిపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం పరిసర ప్రాంతంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు భారీ కొండచిలువను గమనించి ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. చెట్ల దగ్గర నేలపై పొడవుగా విరాజిల్లుతూ ఉన్న ఈ కొండచిలువను చూసి వారు పనులు నిలిపివేశారు. కొండచిలువ ఎవరికి ఎటువంటి హానీ చేయకుండా అటవీ ప్రాంతం వైపు వెళ్లిపోయినట్లు కూలీలు తెలిపారు. అటవీ ప్రాంతాల దగ్గర పని చేసే వారు జాగ్రత్తలు పాటించడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**ములుగు, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కొత్తూరు గ్రామ శివారులో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ములుగు ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరు గ్రామ శివారులో ఉన్న విజయలక్ష్మి క్రషర్ సమీపంలో గల మట్టి రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి శవం ఉన్నట్లు గుర్తించిన గ్రామానికి చెందిన నకిర్త రమేష్ పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు నాలుగురోజులుగా గ్రామంలో తిరుగుతూ కనిపించాడని తెలిపారు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు ఉండగా సుమారు 25 నుండి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మృతుని ఒంటిపై ఆకుపచ్చ చొక్కా, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ఉన్నాయని తెలిపారు. మృతుని వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే ములుగు ఎస్ఐ నెం.8712667338, పోలీస్ స్టేషన్ నెం.8712667461 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

## చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురు అరెస్ట్

**జగదేవ్పూర్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** ఈనెల 11వ తేదీన జగదేవ్పూర్ మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో చైన్ స్నాచింగ్ జరుగగా కేసుకు సంబంధించిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. దుద్దెడ గ్రామానికి చెందిన నర్సింలు, ప్రవీణ్, శేఖర్ ఈనెల 11న కొండపోచమ్మ దేవస్థానంకు వచ్చి అక్కడి నుండి తిమ్మాపూర్ గ్రామంలో ఒంటరిగా ఉన్న రామవ్వ అనే మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లారని, అట్టి విషయంపై కేసు నమోదు చేసిన జగదేవ్పూర్ పోలీసులు దాదాపు 200 సిసి కెమెరాలను పరిశీలించి దుద్దెడ గ్రామంలో నిందితులను ఈరోజు పట్టుకోవడం జరిగిందని, నిందితుల నుండి బంగారు గొలుసును, నేరం చేయడానికి ఉపయోగించిన పల్సర్ బైక్ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన జగదేవ్పూర్ పోలీస్ సిబ్బంది ఖాజా, సత్యనారాయణ, గౌరారం పిఎస్కు చెందిన పరశరాములును సిఐ అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది మహేష్, తాజొద్దీన్, ఖాజా, రవి పాల్గొన్నారు.


వివరాలు తెలుపుతున్న సిఐ రవిరాజు

# ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలి

## డిఆర్‌డివో శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న డిఆర్డిఓ శ్రీనివాస్‌రావు

**నర్సాపూర్ ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** గ్రామస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిరి అర్హులకు అందేలా చూడాలని అదేవిదంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వస్తే తద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని, అదేవిధంగా ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని డిఆర్ డీఏ శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం నర్సాపూర్ లోని రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం పై మండల స్థాయిలో సర్పంచులకు, కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మండల తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో, సీఐ జాన్ రెడ్డి ,ఎంఈఓ తారా సింగ్ ,ఏవో దీపిక, ఐకెపి ఎపిఎం సంగమేశ్వర్, విద్యుత్ ఏఈ రామ్మూర్తి ,మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావుముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో దోమల నివారణకు గాను మరుగు కాలువల పరిశుభ్రత చేయాలని, అదేవిధంగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని అందుకు 90 వేల బిల్లు వస్తుందని ఆయన తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇల్లు మంజూరైనందున ఇల్లు నిర్మించుకునేలా అధికారులు చూడాలన్నారు. అదేవిధంగా ప్రైమరీ స్కూల్ నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు అల్పాహార పథకం జూన్ 2న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని ఆయన తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించాలన్నారు. ఈ మేరకు నర్సాపూర్ లోని మహిళా సంఘాలకు రుణ పంపిణీలో జిల్లాలో నర్సాపూర్ రెండో స్థానంలో ఉందన్నారు. రేషన్ కార్డులు లేని వారు అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అన్నారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు తమ శాఖ పరంగా చేస్తున్న సేవలను ఆయా శాఖల అధికారులు తమ శాఖ తరపున చేస్తున్న పనుల వివరాలను సేవలను సభ్యులకు తెలియజేశారు. అంతేగాక ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

## సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి : ఎమ్మెల్సీ

**గుమ్మడిదల, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త) :** మండల సర్వసభ సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ అంజి రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన గుర్తించి పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.గ్రామాభివృద్ధికి సమిష్టి కృషి అవసరం గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధం, రహదారులు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన పేర్కొన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నదని, వాటి అమలులో స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు.అభివృద్ధి పనులపై సమీక్ష అనంతరం మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో కొనసాగుతున్న పనుల పురోగతిని అధికారులు వివరించగా, అవసరమైన సూచనలు అందించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను సర్పంచులు సమావేశంలో ప్రస్తావించగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు తెలిపారు.అధికారులు, ప్రజాప్రతినిధుల పాల్గొనడం ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అఖిలేశ్ రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కానుకుంట సర్పంచ్ పెంటారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

గుమ్మడిదల, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త) : ఇంటి పెద్దను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఓ నిరుపేద కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుడు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అండగా నిలిచారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని చాకలి దుర్గేష్ అకాల మరణంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. విషయం తెలుసుకున్న గోవర్ధన్ రెడ్డి గురువారం మృతుడి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా దుర్గేష్ కుమార్తెలైన ప్రవళిక, లిఖితల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి పేరిట ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున పోస్టాఫీసులో డిపాజిట్ చేయిస్తానని ప్రకటించారు. అదనంగా తక్షణ అవసరాల కోసం నగదు సాయం అందజేసి, భవిష్యత్తులో కూడా కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం సిజిఆర్ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్, నాయకులు వెంకట్రాంరెడ్డి, రమేష్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

## 22వ వార్డులో బోరుబావి ప్రారంభం


బోరు బావికి తవ్వించడం కోసం భూమి పూజ చేస్తున్న దృశ్యం

**సదాశివపేట్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త) :** ప్రజల దాహార్తిని తీర్చడమే తన ప్రధాన లక్ష్యమని 22వ వార్డు కాంగ్రెస్ నాయకుడు గారెల తుల్జారం తెలిపారు. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ పాలుపంచుకుంటానని ఆయన అన్నారు.వేసవి కాలంలో ఎండలు తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యగా తన 22వ వార్డులో పట్టణ అభివృద్ధి నిధులతో బోరుబావి వేయించి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో త్రాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అదేవిధంగా వార్డులో నీటి ఎద్దడి సమస్య రాకుండా కౌన్సిలర్ గారెల గౌరీదేవితో కలిసి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. తన సంకల్పానికి వార్డు ప్రజలు ఎల్లప్పుడూ చేదోడు వాదోడుగా నిలుస్తూ ముందుకు నడిపిస్తున్నారని తుల్జారం పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గడిల వీరేశం, తుకిడిదాస్, ఎండి సలీం, హనుమయ్య, తిరుపతి, రాజశేఖర్, అశోక్, బాలరాజ్, వెంకటరావు తదితరులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా పోషణ పక్వాడ వేడుకలు

**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** పట్టణంలోని తిరుమలాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.అంగన్వాడి ఉపాధ్యాయురాలు స్వరూప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వీరికి పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రంలో బరువు కొలతలు, ఆరోగ్య పరిక్షలు నిర్వహించి పోషకాహారల లోపానికి తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు జనాభాయ్, స్వాతి, విజయనిర్మల, వార్డు మెంబర్ శాంతా తదితరులు పాల్గొన్నారు.

## 18న సంగారెడ్డిలో జాబ్‌మేళా

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్16, ప్రభాతవార్త :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళా 18న ఉదయం 10:30 గంటలకు సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్ లోని వెలుగు ఆఫీస్ దగ్గర గల జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నిర్వహించబడుతుందని తెలిపారు. జాబ్ మేళాలో హైదరాబాద్‌కు చెందిన జుంబోటైల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పాల్గొంటోందని,ఆ సంస్థలో డెలివరీ బాయ్స్, లోడర్స్, పికర్స్/ప్యాకర్స్, ఇన్వెంటరీ, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, అసోసియేట్స్ పోస్టులకు నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఎస్ఎస్‌సీ మరియు అంతకంటే పై విద్యార్హత కలిగిన పురుషులు, మహిళలు అర్హులని,అభ్యర్థుల వయస్సు 18 నుండి 30 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.18,000 నుండి రూ.20,000 వరకు వేతనం ఇవ్వబడుతుందని పేర్కొన్నారు.కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు అభ్యర్థులతో ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.మరిన్ని వివరాలకు 08455271010 ఫోన్ నంబర్ లో సంప్రదించవచ్చని తెలిపారు.

## సింగూరు ప్రాజెక్టను సందర్శించిన విద్యార్థినులు

**పుల్‌కల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** సింగూరు ప్రాజెక్టును, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం, పెద్దారెడ్డిపేట లోని మిషన్ భగీరథ మంచినీటి శుద్ధి కేంద్రాలను ఇండస్ట్రియల్ పర్యటనలో భాగంగా మెదక్‌లోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థినులు గురువారం సందర్శించారు. ప్రాజెక్టులో వరద నీరు ఎక్కడి నుంచి వస్తుంది, ఏ మేరకు నిల్వ చేస్తారు లాంటి అంశాలను విద్యార్థినులు అడిగి తెలుసుకున్నారు. జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అయ్యే తీరును, విద్యుత ఉత్పత్తి సమార్థ్యం, పనితీరుపై అవగాహన పొందారు. పెదారెడ్డిపేటలోని మిషన్ భగీరథ శుద్ధి కేంద్రానికి చేరుకుని నీటి శుద్ధి జరుగుతున్న తీరను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర బీవీ సుబ్బ, వి వెంకటేశ్, ఇ రమ్య, బీ రవికాంత్‌రెడ్డి, ల్యాబ్ అసిస్టెంట్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా
### రాష్ట్రస్థాయి టాప్10 జాబితాలో చోటు
### నేటి నుంచే ప్రవేశాలు ప్రారంభం..

**మెదక్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సరికొత్త చరిత్ర సృష్టించింది. కళాశాల యంత్రాంగం కనబరిచిన అద్భుత పనితీరు, పాలనా దక్షతకు గుర్తింపుగా ఈ విద్యాసంస్థకు'అటానమస్ (స్వయంప్రతిపత్తి) హోదా లభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 149 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మినిస్ట్రేషన్, ఎంఓయూలు, మరియు సీఎస్ఆర్ నిధుల వినియోగం వంటి కీలక అంశాల్లో మెదక్ కళాశాల మొదటి పది స్థానాల్లో నిలవడంతో ఈ గౌరవం దక్కింది. 1981లో కేవలం ఒకే ఒక్క కోర్సుతో ప్రారంభమైన ఈ ప్రస్థానం, నేడు 14 కోర్సులు మరియు 1,443 మంది విద్యార్థులతో జిల్లాలోనే తలమానికంగా నిలుస్తోంది. అటానమస్ హోదా లభించడం వల్ల విద్యార్థులకు అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. కళాశాల స్వంతంగా పరీక్షల నిర్వహణ చేపట్టడంతో పాటు స్థానిక అవసరాలకు తగ్గట్టుగా నూతన సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులను ప్రవేశపెట్టే వీలుంటుంది. ముఖ్యంగా విద్యార్థులకు ఫీజుల విషయంలో 30 నుండి 40 శాతం వరకు రాయితీ లభించే అవకాశం ఉంది. కళాశాల అభివృద్ధిలో భాగంగా ఇన్ఫోసిస్, ఎన్.వి.లక్ష్మీ ఫౌండేషన్ వంటి ప్రముఖ సంస్థల సహకారంతో విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, డిజిటల్ లైబ్రరీ మరియు ఉచిత ఆరోగ్య సదుపాయాలు కూడా అందుతున్నాయి. మరోవైపు, 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి దోస్త్ ఆన్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ తెలిపారు. మొదటి దశ రిజిస్ట్రేషన్లు ఏప్రిల్ 15 నుండి మే 7వ తేదీ వరకు కొనసాగుతాయి. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వెబ్ ఆప్షన్లలో మెదక్ అటానమస్ కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల సహాయార్థం కళాశాలలో ప్రత్యేక హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. అడ్మిషన్ల వివరాల కోసం 79013 96797, 90300 56030 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## న్యూస్ యాంకర్‌కి 'సోషల్ మీడియా'లో వేధింపులు

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లోని ఒక టీవీ ఛానెల్‌లో పనిచేస్తున్న యాంకర్‌ను సోషల్ మీడియాలో వేధిస్తున్న అగంతకులపై జూబ్లీహి ల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 10లోని 3టీవీ కార్యాలయంలో ఒక యువతి(22) న్యూస్ యాంకర్‌గా పనిచేస్తుంది. ఆమెకు గురువారం బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఉద్యోగంలో చేరినందుకు బెదిరించడంతోపాటు ఉద్యోగంలో నుంచి తొలగిస్తామంటూ బెదిరించారు. అదే వ్యక్తి పలు వాట్సాప్ నంబర్ల నుండి ఇన్‌స్టా ఐడీ(అరుణ్ జాపుల448) నుంచి బెదిరింపులు, అసభ్య సందేశాలు పంపాడు. అంతేకాకుండా ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకొని వేధింపులకు పాల్పడటంతోపాటు, మార్ఫింగ్ చేసిన పొటోల ను స్నేహితులకు, బంధువులకు పంపుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనంతటి వెనుక మాజీ ప్రియుడు వద్దే హరీష్ కారణమై ఉంటాడని అనుమానిస్తూ ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చేపల మార్కెట్ ప్రాంతంలో అక్రమాల తొలగింపు

**బేగంబజార్,ఏప్రిల్ 16ప్రభాతవార్త:**

బేగంబజార్ చేపల మార్కెట్ పరిసర ప్రాంతాలల్లో అక్రమంగారోడ్డుపై అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుం టామని అసిస్టెంట్ ఇంజనీర్ కలమ్మ అన్నారు.బేగంబజార్ చేపల మార్కె ట్ పరిసరాలో చేపలు అమ్మకాలు చేసే వారు ఏకంగా రహదారులపై అమ్మకాలు చేసి చెత్తాచెదారాన్ని వేయడం ద్వారా అపరిశుభ్రతగా మారు తుందన్నారు.గురువారంఅసిస్టెంట్ ఇంజనీర్ కలమ్మ ప్రగతి పాలనలో భాగంగా సానిటేషన్ సిబ్బంది,ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలసి ఆమె స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు.చేపల వ్యాపారం చేసుకునే వారికి భవనం కట్టించారని,అందులోనే అమ్మకాలు చేసుకోవాలని,రహదారిపై చేపల అమ్మకాలు చేయడం ద్వారా వాహనాదారులకు,పాదాచారులకు,అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికుల ఫిర్యాదు మేరకు స్పెషల్ డ్రైవ్ చేయడం జరిగిందన్నారు.

రహదారులపై వ్యాపారులపై కొంతమందికి చలాన్లు వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలోన జిహెచ్ఎంసి, ఎన్‌ఫోర్స్ మెంట్ సిబ్బంది ఉన్నారు.

## నాలుగేళ్ల బాలుడికి యాసిడ్ తాగించిన మహిళ
### బోడుప్పల్‌లో వెలుగులోకి అమానవీయ ఘటన

**ఉప్పల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** తన పిల్లల కంటే తోడి కోడలి పిల్లలపైనే మామ ప్రేమగా ఉంటున్నారనే కారణంతో ఒక మహిళ నాలుగేళ్ల బాలుడికి జ్యూ స్ అని చెప్పి యాసిండ్ తాగించిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..బోడుప్పల్ శ్రీనివాస కాలనీకి చెందిన పర్వతం నాగరాజు, సంధ్య దంపతులకు ఇద్దరు సంతానం. కొడుకు కార్తీక్ వాసు (4) స్థానికంగా ప్లే స్కూలులో చదువుకుం టున్నాడు. వీరు నాగరాజు తల్లిదండ్రులు సతీశ్ కుమార్, అంజమ్మతో కలిసి నివాసం ఉంటున్నారు. అదే ఇంట్లో నాగరాజు సోదరుడు జగదీష్, ఆయన భార్య మంజుల కూడా ఉంటున్నారు. అయితే తన కొడుకు కంటే కార్తీక్ వాసు పైనే మామ సతీశ్ ఎక్కువ ప్రేమ చూపిస్తున్నారంటూ మంజుల తరుచూ గొడవ లకు దిగేది. ఈ క్రమంలో ఆబాలుడిపై ద్వేషాన్ని పెంచుకొని, పలుమార్లు హత్యాయత్నం చేసింది. ఒకసారి బెడ్రూమ్‌లో బాలుడి ముక్కు. నోరు మూసి ఊపిరి ఆడకుండా చేయబోగా, తల్లి చూసి అడ్డుకుంది. మరోసారి భవనంపైకి తీసుకెళ్లి ప్రమాదకరంగా రేలింగ్‌పై కూర్చోబెట్టగా మామ గమనించి మందలించారు.కాగా ఈ నెల 9న రాత్రి 10 గంటల సమయంలో కార్తీక్ వాసు హాల్లో ఆడుకుంటుండగా, మంజుల అతడిని గదిలోకి పిలిచింది. చాక్లెట్ ఇస్తాన ని ఆశ చూపి, వంటిట్లోకి తీసుకెళ్లి జ్యూస్ అని నమ్మించి యాసిడ్ తాగించింది. అది తాగిన వెంటనే ఆ బాలుడు విలవిలలాడుతూ కేకలు వేయడంతో తల్లి సం ధ్య పరుగున వచ్చింది. తొలుత నిందితురాలు బుకాయించినప్పటికీ, చిన్నారి కార్తీక్ జరిగిన విషయాన్ని చెప్పడంతో అసలు విషయం బయటపడింది. వెంట నే బాలుడిని చికిత్స నిమిత్తం స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. మూడ్రోజుల చికిత్స అనంతరం బాలుడు కోలుకోవడంతో మంగళవారం రాత్రి వాసు తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వివాదాస్పదంగా మారిన పీవీఆర్ ఉద్యోగి మృతి

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**

ఇర్రంమంజిల్‌లోని గెలేరియా పీవీఆర్ మాల్‌లో పనిచేసే ఒక ఉద్యోగి మృతి వివాదస్పదంగా మారింది. న్యాయం కోసం కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో ఇక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. వివరాల్లోకి వెళితే.. గెలేరియా పీవీఆర్ మాల్‌లో హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ(45)కు గురువారం ఉదయం విధుల్లో ఉన్న సమ యంలో ఛాతిలో నొప్పి వచ్చింది. దీంతో అసౌకర్యానికి గురైన ఆయన ఇంటికి వెళ్తానంటూ అక్కడున్న తన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అందుకు వారు నిరాకరించడంతో నొప్పితోనే విధులు నిర్వర్తించిన సత్యనారాయణ కాసేపటికి ప్రొజెక్టర్ ముందు ప్రాణాలు కోల్పోయాడు. అది గమనించిన యాజ మాన్యం అతని మృతదేహాన్ని అక్కడి నుంచి తొలగించి రోడ్డు ఫుట్‌పాత్‌పై పడుకోపెట్టారు. అనంతరం అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందిం చారు. దీంతో అక్కడికి చేరుకున్న సత్యనారాయణ కుటుంబ సభ్యులు జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. థియేటర్ యజమాన్యం కారణంగానే ప్రాణాలు కోల్పోయాడంటూ ఆందోళనకు దిగారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న పంజాగుట్ట పోలీసులు మృతదేహాన్ని శవపంచనామాకు తరలించేందుకు యత్నించగా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు.

న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో అదనపు డీసీపీ ఆనంద్, పంజాగుట్ట డివిజన్ ఏసీపీ పి. మురళీకృష్ణ, పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని మృతుడి భార్య కల్పన పోలీసులను కోరారు. గురువారం సాయంత్రం పొద్దుపోయే వరకు మృతదేహంతో ఆందోళన నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆందోళనలో సిఐటీయూ నగర కార్యదర్శి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# పైతర చెక్‌డాంలో మంజీరా పరవళ్లు

### రైతుల ఆనందం - గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


మంజీర పరవళ్లకు పూజలు చేస్తున్న దృశ్యం

**కొల్చారం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పైతర గ్రామ చెక్‌డాంవద్ద మంజీరా నది పరవళ్ళు తొక్కుతూ ప్రవహించడంతో పరివాహక ప్రాంత రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. సింగూర్ ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేయడంతో చెక్‌డాం నిండుకుండలా పొంగిపొర్లుతోంది. నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో మండల నాయకులు, గ్రామ రైతులతో కలిసి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతుల పంటలు పండిపొంగి సిరిసంపదలతో సంతోషంగా ఉండాలని ప్రార్థిస్తూ కొబ్బరికాయలు కొట్టి, పూలు చల్లి గంగమ్మ తల్లికి హారతులు సమర్పించారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశంగౌడ్ మాట్లాడుతూ, పైతర చెక్‌డాం వద్ద మంజీరా నది ప్రవహించడం రైతులకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి, వివేక్, వేం నరేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, యూత్ అధ్యక్షులు అల్లి చందు, బండి రమేష్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ గోపిగారి దుర్గేష్ గౌడ్, తుక్కాపురం శ్రీశైలం, రంగంపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోండా కృష్ణ, కోనాపూర్ అధ్యక్షుడు బండి మల్లేశం, పైతర గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమేష్, ఆగంగౌడ్, ఉపేందర్‌గౌడ్, రామ కృష్ణయ్య, శివ, చిలుక ప్రభాకర్, తుడుము రామప్పయ్య, దుర్గయ్య, గౌస్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

### సింగూర్ నీటి విడుదలకు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కృషి అభినందనీయం

**కొల్చారం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** రైతుల పంటలు ఎండిపోతున్నాయని, రైతుల కన్నీటిని తుడిచేందుకు అసెంబ్లీలో సింగూర్ నీటి విడుదల సమస్యను ప్రస్తావించి రైతుల పక్షాన నిలబడి నీటి విడుదలకు కృషిచేసిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు, పైతర గ్రామ సర్పంచ్ యాబన్నగారి రవితేజరెడ్డి తెలిపారు. కొల్చారం మండలం పైతర గ్రామ చెక్ డ్యాం వద్ద మంజీరానది పరవళ్లు తొక్కుతూ ప్రవహించడంతో గ్రామ రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ యాబన్నగారి రవితేజ రెడ్డి గ్రామ రైతులు, నాయకులతో కలిసి గంగమ్మ తల్లికి కొబ్బరికాయలు కొట్టి హారతి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు మురళి, సంతోష్ ఎల్లేశం, మాజీ ఎంపిటిసి ఎల్లయ్య, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేశం, వార్డు సభ్యులు రాజా గౌడ్, మల్లేశం, మానయ్య, శేఖర్ మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాలి : ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని జుక్కల్ శివారులో గల కన్వెన్షన్ హాల్ వేదికగా గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, వివిధ శాఖల పనితీరుపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా ఎమ్మెల్యే రెవెన్యూ, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్, విద్యాశాఖ, ఐకేపీ, హౌసింగ్ శాఖల అధికారులతో గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పనుల గురించి సుదీర్ఘంగా చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, ఇళ్ల నిర్మాణాల విషయంలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని, మహిళా సంఘాల బలోపేతానికి ఐకేపీ అధికారులు కృషి చేయాలని కోరారు. సమిష్టి కృషితోనే అభివృద్ధి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకవన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి నారాయణఖేడ్ నియోజకవర్గన్నీ ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల పట్ల సానుకూలంగా స్పందించి, గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభకు ఎమ్మెల్యే అభినందనలు

**నారాయణఖేడ్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ వడ్ల రాజయ్య కూతురు ఇటీవల విడుదల ఐన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఏకంగా 5వ ర్యాన్క్ సాధించడం అభినందనీయమని నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మారు మూలా ప్రాంతంలో ఇలాంటి ఆణిముత్యాలు విద్యలో రాణించడం ఆనందదాయకమ న్నారు. 1000 మార్కులకు గాను ఏకంగా 992 మార్కులు సాధించడం ఆమె ప్రతిభకు అందరు ఆదర్శనంగా తీసుకోవాలన్నారు. ఖేడ్ ప్రాంత విద్యార్థులకు మా ప్రభుత్వ అండ దండాలు ఎల్లకాలం ఉంటుందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చంద్రశేఖర్‌రెడ్డితో కలసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీ సంహితకు శాలువాతో ఘనంగా సన్మానించారు.

## మహిళలకు కుట్టుమిషన్‌లో శిక్షణ

**నర్సాపూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** విద్యార్థుల యూనిఫాం స్టిచ్చింగ్ వలన సంఘాల్లో ఉన్నటువంటి మహిళలకు ఉపాది లభిస్తుందని నాన్ ఫామ్ డిపిఎం యాదయ్య అన్నారు. గురువారం నర్సాపూర్ మండల సమైక్యలో నియోజకవర్గ పరిధిలోని కౌడిపల్లి నర్సాపూర్ చిలిపిచేడు శివంపేట మండలాలకు సంబంధించిన టైలర్స్ యూనిఫామ్స్ స్టిచ్చింగ్‌పై నాలుగురోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏపీపీసీ (ఆర్గనైజేషన్ ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్) ద్వారా టైలర్ కు శిక్షణ ఇప్పించారు. ఈ శిక్షణలో ట్రైనర్ జ్యోతి భార్గవి ల ద్వారా సంఘంలో ఉన్న మహిళలకు కొలతలు తీసుకునే విధానము స్టిచ్చింగ్ చేసే విధానము కాజా బటన్ నిర్వహణ మరి కుట్టు మిషన్ రిపేర్ గురించి శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణలో సుమారు 60 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో నాన్ ఫామ్ డిపిఎం యాదయ్య హాజరై కుట్టు శిక్షణ విదానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల యూనిఫాం స్టిచ్చింగ్ వల్ల సంఘాల్లో ఉన్నటువంటి మహిళలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ శిక్షణతో సంఘ సభ్యులైన మమిళలకు ఎంతో ఉపయోగపడుతుందని ముందు ముందు అంగన్వాడి విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రిలకు సంబంధించిన డ్రెస్సులు స్టిచ్చింగ్ చేయవలసి ఉంటుందని తెలిపారు.అనంతరం ఏపిఎం సంగమేశ్వర్ మాట్లాడుతూ ఈ ట్రెనింగ్ వల్ల నైపుణ్యత పెరుగుతుందని పేర్కొంటు మహిళలు ఆర్థికంగా ఎదుగుదల జరుగుతుందని ఆయన వివరించారు.ఈ మేరకు ఈ శిక్షణ పొందిన వారందరికీ సర్టిఫికెట్స్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎం భీమయ్య, ఏపిఎం సంగమేశ్వర్ ,సీసీలు రవీందర్, నాగరాజు, నర్సింలు, సంఘ మమిళలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

**వెల్దుర్తి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్. ఎంపీడీవో ఉమాదేవి. స్థానిక ఎస్ఐ రాజు. మండల అన్ని శాఖల అధికారులు. సర్పంచులు. ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై రాజు మాట్లాడుతూ. రోడ్డు భద్రత చర్యలు. ప్రమాదాల నివారణ.. ప్రజలకు అవగాహన కల్పించవలసిన అధికారులకు. ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. వెల్దుర్తి గ్రామానికి చెందిన ఆటో. స్కూల్ బస్ డ్రైవర్లు. వృద్ధులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 100 మంది కంటి పరీక్షలు నిర్వహించి. అవసరమైన వారికి ఉచితంగా. కళ్ళ అద్దాలను పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని. సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా చైతన్యం తీసుకురావాలని స్థానిక ఎస్సై రాజు కోరారు.

## కూకట్‌పల్లిలో గ్యాస్, పెట్రోల్ మాఫియా దందా

**మూసాపేట్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి ప్రాంతంలో కమర్షియల్ గ్యాస్, పెట్రోల్ సరఫరా పేరుతో జరుగుతున్న భారీ అక్ర మాలు సామాన్య ప్రజలను, చిన్న వ్యాపారులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకుల యజమానులు కుమ్మక్కై సృష్టి స్తున్న ఈ కృత్రిమ కొరతపై తెలంగాణ ఏసీబీ అధికారులు తక్షణమే స్పందించి, విచారణ జర పాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఈసేవా కేంద్రాల్లో అధిక ధరలపై దాడులు చేసిన తరహాలోనే, గ్యాస్ డీలర్ల ఆగడాలపై కూడా విచారణ జరిపి వాస్తవాలను నిగ్గుతేల్చాలని కోరు తున్నారు.గ్యాస్ సిలిండర్ల పంపిణీలో డీలర్లు "మే ము ఎంత చెబితే అంత" అన్నట్లుగా వ్యవహరిస్తూ బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్స హిస్తున్నారు. ప్రభుత్వం అధికారిక ధరకే డీలర్లకు సరఫరా చేస్తున్నప్పటికీ, వారు మాత్రం చిన్న వ్యాపారులకు వాస్తవ ధరతో కూడిన బిల్లులు ఇవ్వకుండా, దయదాక్షి ణ్యాలతో ఇస్తున్నట్లుగా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. గ్యా స్ ఏజెన్సీలతో నేరుగా సంబంధం లేని చిన్న టీ దుకాణాలు, టిఫిన్ సెంటర్లు నడిపే వారిని లక్ష్యంగా చేసుకుని మూడు నుండి నాలుగు రెట్లు అధిక ధర వసూలు చేస్తున్నారు. గ్యాస్ కొరత లేని సమయంలో కూడా కొత్త కనెక్షన్ల కోసం వెళ్తే.. స్టవ్ కొనుగోలు, తనిఖీలు, మెయింటెనెన్స్ పేర్లతో వెయ్యిపదిహేను వందల రూపాయల వరకు అదనంగా దండుకునే డీలర్లు, ప్రస్తుతం కమర్షియల్ గ్యాస్ రూపంలో అధిక దోపిడీ చేస్తున్నారని బాధి తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకు ల్లో సైతం స్పీడ్ పెట్రోల్ పేరుతో దోపిడీ పతాక స్థాయికి చేరింది. సాధారణ పెట్రోల్‌ను అందు బాటులో ఉంచకుండా, కేవలం స్పీడ్ పెట్రోల్ మాత్రమే విక్రయిస్తూ ప్రతి లీటరుకు ఆరు రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నా రు. అయితే స్పీడ్ పేరుతో కూడా సాధారణ పె ట్రోలే పోస్తున్నారన్న అనుమానాలు వాహనదారు ల్లో వ్యక్తమవుతున్నాయి. లీగల్ మెట్రాలజీ అధికారులు కేవలం సినిమా థియేటర్లు, చాపల మార్కెట్లపై మాత్రమే దృష్టి పెట్టడం తప్ప, సామాన్యుడిని నిలువునా ముంచుతున్న ఈ గ్యాస్, పెట్రోల్ మాఫియా వైపు చూడటం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

ఈ గ్యాస్, పెట్రోల్ ధరల ప్రభావం సామాన్యుడి భోజనం, టిఫిన్ ధరలపై పడి మధ్యతరగతి జీవనం ఛిద్రమవు తోంది. ఈ గందరగోళ పరిస్థితిపై ప్రభుత్వం తక్ష ణమే జోక్యం చేసుకోవాలని, ప్రతి గ్యాస్ ఏజెన్సీ, పెట్రోల్ బంక్ వద్ద సంబంధిత అధికారుల నంబర్లు పెద్ద అక్షరాలతో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి, చిన్న వ్యాపారుల కు అండగా నిలిచే స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సమీక్షా సమావేశం

**మర్కుక్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, నిర్వహించే అభివృద్ధి పనులపై ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద గురువారం మర్కుక్ రైతువేదికలో సమీక్షాసమావేశం నిర్వహించారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు,వివిధశాఖల అధికారులు హాజరై మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి వేగవంతంగా అమలుచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు కూడా తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. మండలంలో అమలు అవుతున్న పథకాల పురోగతిని సమీక్షించడంతో పాటు రాబోయే రోజుల్లో చేపట్టబోయే పనులపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సరిత, ఎంపిడివో అశోక్‌కుమార్, ఎస్ఐ దామోదర్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ధూళిమిట్ట, ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని జాలపల్లి గ్రామ సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్ కోరారు. గురువారం జాలపల్లిలో అభ్యుదయ గ్రామ ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేతావెంకటాచారితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. అలాగే రాష్ట్రంలో ఏకకాలంలో 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల లోపు ఉన్న బ్యాంకు రుణాలను మాఫీచేసి రూ.21 వేల కోట్లు వెచ్చించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్, డీటీ ఫహీముద్దీన్, ఉప సర్పంచ్ పరశురామ్‌గౌడ్, సీసీ కనక చంద్రం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వీఓఏ అనిత, వార్డు సభ్యులు మంజుల, కాశీరాములు, మంజుల, అంగన్‌వాడీ టీచర్ పద్మ, డీలర్ మల్లారెడ్డి, రైతు నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణ సభ్యులకు సర్టిఫికెట్లు ప్రదానం

**ధూళిమిట్ట, ఏప్రిల్ 16,ప్రభాతవార్త :** మండలంలోని తోర్నాల గ్రామంలో జల్‌జీవన్, ఉమెన్ ఎంపవర్మెంటు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 30 రోజుల కుట్టు శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తిచేసుకున్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన 30 మంది మహిళలకు సర్పంచ్ చొప్పరి రాము, మానస సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జల్ జీవన్, ఉమెన్ ఎంపవర్మెంటు సొసైటీ సీఈఓ రవికుమార్, డైరెక్టర్ వెంకటలక్ష్మి, సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ రాణి, మండల టైలరింగ్ శిక్షకురాలు స్వప్న శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి : సర్పంచ్


సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

**చిన్నకోడూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** మండలపరిధిలోని మాచాపూర్‌లో గురువారం సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ యాట సత్యలక్ష్మీ యాదయ్య మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏలేటి రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహ్మారెడ్డి, ఎఫ్ఎస్‌సిఏ చైర్మన్ గడ్డం వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు గాజుల బాబు, సుంచు నర్సయ్య, జ్యోతి, డాక్టర్ ఖాదర్, బిఆర్ఎస్ నాయకులు సుంచు ఎల్లయ్య, కంకటి కిష్టయ్య తదితరుల పాల్గొన్నారు.

## అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

### మున్సిపల్ చైర్మన్ గంగిసెట్టి చందన రవీందర్


మాట్లాడుతున్న గంగిసెట్టి చందన రవీందర్

**గజ్వేల్‌టౌన్, ఏప్రిల్ 16(ప్రభాతవార్త):** అభివృద్ధిపనులలో జాప్యం జరగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ గంగిసెట్టి చందనరవీందర్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ గంగిసెట్టి చందన రవీందర్ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటగోపాల్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించగా, పట్టణ అభివృద్ధి, ప్రజా సౌకర్యాలు, పలు కీలక సామాజిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఆర్ అండ్ ఆర్‌కాలనీలో నిర్మించిన వైకుంఠధామంను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, ఆర్‌అండ్‌ఆర్‌కాలనీ ప్రజల సౌకర్యార్థం పట్టణంలో మెరుగైన ఆర్టీసీ బస్సు సౌకర్యాల కల్పన, 7వ వార్డులో 10 పడకల ఆసుపత్రిలో అవసరమైన వైద్య సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకోవాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానించగా, ఈ అంశాలను తక్షణమే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. అనంతరం చందన రవీందర్ మాట్లాడుతూ వార్డుల వారీగా పెండింగ్‌లో ఉన్న అంతర్గత రహదారులు, డ్రైనేజీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా పట్టణంలో పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని, చెత్త సేకరణ వాహనాలు ప్రతి రోజు ప్రతి ఇంటికి వెళ్లేలా పర్యవేక్షించాలని సూచించారు. కౌన్సిల్ సభ్యులు తమ వార్డుల్లో త్రాగునీరు, వీధిదీపాల సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. అలాగే పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి వార్డులో మొక్కల పెంపకం, పార్కుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జగదేవ్‌పూర్‌ను ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి

### -ఉపసర్పంచ్ మచ్చ గణేష్

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో నియోజకవర్గాల పెంపు జరిగినట్లయితే సిద్దిపేట జిల్లాలోని జగదేవ్‌పూర్ మండలాన్ని ప్రత్యేక నియోజకవర్గంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని జగదేవ్‌పూర్ ఉప సర్పంచ్ మచ్చ గణేష్ అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అతిపెద్ద 4వ మండలంగా ఉన్న జగదేవ్‌పూర్ మండలం 25 సంవత్సరాల నుండి అభివృద్ధికి నోచుకోలేదని, జగదేవ్‌పూర్‌ను నియోజకవర్గంగా చేసినట్లయితే జగదేవ్‌పూర్‌తో పాటు పరిసర గ్రామాలు, మండలాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. పార్టీలకతీతంగా జేఏసిని ఏర్పాటుచేసి ప్రత్యేక నియోజకవర్గం ఏర్పాటు కోసం పోరాడుతామని అన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే మండల సభల లక్ష్యం

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**కొల్చారం, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం మండల సభల ప్రధాన లక్ష్యమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మెదక్ జిల్లా కొల్చారం మండలంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతంతో సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మండల సమావేశంలో లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని ప్రాధాన్యంగా పరిగణించి నిర్ణీత కాలంలో పరిష్కారం చూపాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతుల సమస్యలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.అదేవిధంగా ప్రతి గ్రామంలో కనీసం పది మంది రైతులతో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులకు అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, శిక్షణలు అందిస్తూ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంలో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో సర్పంచ్‌లు ముఖ్య బాధ్యత వహించాలని తెలిపారు. అనంతరం మండల సమాఖ్య సభ్యురాలు మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణ అభివృద్ధిలో మహిళా సంఘాల పాత్ర గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో మహిళలు ఆర్థికంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఇందిరమ్మ లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తమకు స్థిరమైన నివాసం కలగడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. ఇంతకాలం ఎదుర్కొన్న గృహ సమస్యలకు శాశ్వతపరిష్కారం లభించిందని, తమ కుటుంబాలకు భద్రతతో కూడిన జీవనం కల్పించిందని తెలిపారు. పేదలకు ఇల్లు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసాచారి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, ఎంపీడీవో రఫీక్ ఉన్నిసాబేగం, సర్పంచ్ దేవన్న గారి శేఖర్, సర్పంచ్ నాయిని గజినీ వెంకట్ గౌడ్, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఎంపి తేజస్వి సూర్య వ్యాఖ్యలు అర్థరహితం

### గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

**గజ్వేల్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** లోక్‌సభలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా మాట్లాడిన బిజెపి ఎంపి తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోలుస్తూ అవమానకర వ్యాఖ్యలు చేయడం అర్థరహితమని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఖండించారు. గురువారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుపై పదేపదే బిజెపి తన అక్కసు వెళ్లగక్కే ప్రయత్నం చేస్తుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల పోరాటం, అనేక త్యాగాల ఫలితంగా రాజ్యాంగ బద్ధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిందని అన్నారు. తెలంగాణ పోరాటం పట్ల గానీ, చరిత్ర పట్ల గానీ బిజెపి పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదని, పార్లమెంట్ వేదికగా గతంలోనూ అనేక సందర్భాలలో బిజెపి నాయకులు తెలంగాణ ఏర్పాటు పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారని గుర్తుచేశారు. గతంలో సాక్షాత్తు ప్రధాని నరేంద్రమోడి కూడా తెలంగాణ ఏర్పాటుపై మాట్లాడుతూ తల్లిని చంపిన బిడ్డను బ్రతికించారని అనుచిత వ్యాఖ్యలు చేశారని అదే పరంపరలో బిజెపి నాయకులు పదే పదే తెలంగాణ ఏర్పాటును అపహాస్యం చేస్తూ మాట్లాడుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఉత్తగ రాలేదని, కెసిఆర్ రాజకీయ చతురత, ఆమరణ నిరాహార దీక్ష, విద్యార్థుల వీరోచిత పోరాటం, ప్రాణాలను తృణప్రాయంగా అర్పిం చిన అమరవీరుల త్యాగాల ఫలితంగా దేశంలోని మెజార్టీ రాజకీయ పార్టీల మద్దతుతో పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ఏర్పాటు బిల్లు పాస్ కావడంతో రాష్ట్రం ఏర్పాటు అయ్యిందనే సత్యాన్ని మరిచి బిజెపి నాయకులు మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. పార్లమెంట్‌లో తేజస్వి సూర్య అవమానకర వ్యాఖ్యలుచేస్తే తెలంగాణకు సంబంధించిన పార్లమెంట్ సభ్యులు ఖండించకపోవడం దురదృష్టకరమన్నారు.లోక్‌సభలో బిఆర్ఎస్ పార్టీకి ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల తెలంగాణ మీద ఎటువంటి వ్యాఖ్యలు చేసినా అడిగేవాడే లేకుండా పోయారన్నారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బిజెపి నాయకులు వెంటనే స్పందించాలని భేషరతుగా తేజస్వి సూర్య తన వ్యాఖ్యలు ఉపసంహరించుకొని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిజెపి పార్టీ తెలంగాణ వ్యతిరేకిగా తెలంగాణ ప్రజల హృదయాల్లో నిలిచిపోతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, కొమురయ్య, మధుసూదన్‌రెడ్డి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాండు

## అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలి

### -అదనపు కలెక్టర్ పాండు

**జహీరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో సర్పంచ్‌ల పాత్ర కీలకంగా ఉండాలని, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాల్సిన బాధ్యత సర్పంచ్‌లపై ఉందని లోకల్ బాడి జిల్లా అదనపు కలెక్టర్ పాండు అన్నారు. గురువారం పట్టణంలోని మండల పరిషత కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేసేందుకు సర్పంచ్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వైద్యం, పారిశుద్ధ్యం, మంచినీరు సరఫరాకై దృష్ఠి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి ఏడి బిక్షపతి, ఎంపిడిఓ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ పి దశరథ్, రూరల్ ఎస్ఐ ఎం కాశీనథ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 12వ వార్డులో సమస్యలపై చైర్మన్ కుమార్‌గౌడ్ దృష్టి

### ప్రజలతో ముచ్చటిస్తూ సమస్యల వివరాలు తెలుసుకున్న చైర్మన్

గుమ్మడిదల ఏప్రిల్ 16 ప్రభాతవార్త : గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ శనివారం పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులో తాగునీటి సరఫరా, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల పరిస్థితిపై గ్రామ నాయకులతో కలిసి ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు.ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న చైర్మన్, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.ప్రజలతో ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అభ్యర్థనలను వినిపించుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ కత్తుల రమేష్, నాయకులు ఆకుల సత్యనారాయణ, వెంకట్రాం రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి,తదితరులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## అల్లాదుర్గం కేంద్రంగా నియోజకవర్గం చేయండి

### -బిజెపి మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి

**అల్లాదుర్గం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** అల్లాదుర్గం కేంద్రంగా నూతన అసెంబ్లి నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని బిజెపి మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓలకు వినతిపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ భౌగోళికంగా, పరిపాలనపరంగా అల్లాదుర్గం టేక్మాల్, పెద్దశంకరంపేట, రేగోడ్ మండలాలకు సమాన దూరంలో ఉందని గుర్తు చేశారు. ఆయా మండలాలలో పాటు వట్‌పల్లి మండలాన్ని కలుపుకుని కొత్త నియోజకవర్గం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల బిజెపి ప్రధాన కార్యదర్శి కాల రాములు, బీజేవైఎం నాయకులు రమేష్, బాలరాజ్, సత్యనారాయణ ఉన్నారు.

## గుర్తింపు కార్డుల సమస్యలకు హెల్ప్ డెస్క్ ప్రారంభం

**సదాశివపేట, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** ప్రజలు తమ గుర్తింపు కార్డులకు సంబంధించిన సమస్యలు, సందేహాలను నివృత్తి చేసుకోవడానికి సర్ స్వచ్ఛంద సంస్థ హెల్ప్‌డెస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏఐఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు గౌస్‌పాషా అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్వాన్ ఎమ్మెల్యే మొయినుద్దీన్ పర్యవేక్షణలో, పార్టీ జాతీయ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు సర్ హెల్ప్ డెస్క్ ను ప్రారంభించి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంబంధించిన ఓటర్ కార్డు, ఆధార్ కార్డు వంటి గుర్తింపు కార్డుల్లో ఎలాంటి పొరపాట్లు ఉన్నా తమ కార్యాలయానికి వచ్చి సరిదిద్దుకునేలా సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్, నాయకులు వాజిద్, రియాజ్, మోయిస్ పాల్గొన్నారు.

## తైబజార్ సమస్య పరిష్కారించాలంటూ ఎంపీడీవోకు వినతి

**హత్నూర, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మండలంలోని కాసాల దౌల్తాబాద్ గ్రామాల రెవెన్యూ పరిధిలో నెలకొన్న తైబజార్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాసాల గ్రామ పంచాయతీవార్డు సభ్యులు గురువారం ఎంపీడీవో, ఎంపీఈఓ కు వినతి పత్రం అందజేశారు. కొన్నేళ్లుగా ఇరు గ్రామాల మధ్య తైబజారు విషయం పెద్దసమస్యగా మారిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నగేష్, ప్రతాప్,సాగర్, గ్రామస్తులు ఉన్నారు.

## హెల్మెట్ ధరించండి-ప్రాణాలను కాపాడుకోండి : సిఐ

**జహీరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** హెల్మెట్, సీటు బెల్టు ధరించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురైతే తమ ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుందని పట్టణ సిఐ శివలింగం అన్నారు. గురువారం పోలీసు శాఖ తరఫున పట్టన సిఐ శివలింగం ఆధ్వర్యంలో పట్టణ ఎస్ఐ కే వినయ్ కుమార్, రూరల్ ఎస్ఐ ఎం కాశీనాథ్, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డిల పర్యవేక్షణలో ఆరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని హెల్మెట్ ధరించి మహీంద్రా కర్మాగారరం నుంచి మెథడిస్ట్ చర్చి వరకు 500 మంది బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటిస్తూ వహనాలను రోడ్డెక్కించాలని సూచించారు.

# చారిత్రాత్మక పథకాలకు ప్రభుత్వం శ్రీకారం

### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



మాట్లాడుతున్న అబ్దుల్ హమీద్

**వర్గల్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త):** చారిత్రాత్మక పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అయితే వాటిని పేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ స్పష్టం చేశారు. గురువారం వర్గల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రగతి ప్రణాళిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల ప్రత్యేకాధికారి పవన్‌కుమార్, ఎంపిడివో దామోదర్‌రెడ్డి, తహసీల్దార్ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డితోకలిసి మాట్లాడారు.జిల్లాలో ఆయిల్‌ఫామ్ పంట సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాలని, దానికి తగినట్లుగా ప్రభుత్వం సబ్సిడీ అందజేయడంతో పాటు రూ.350 కోట్లతో నిర్మించిన ఫ్యాక్టరీని సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించినట్లు గుర్తుచేశారు. అలాగే రిఫైనరీకి సైతం చర్యలు తీసుకుంటుండగా, మూడేళ్లలో దిగుమతి వచ్చే ఆయిల్‌ఫామ్ పంటలో అంతర పంటలు సాగుచేసి ప్రయోజనం పొందవచ్చని అన్నారు. ప్రగతి ప్రణాళికలో 10 అంశాలకు ప్రాధాన్యత ఇస్తుండగా, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు కూడా పరిష్కారం కానున్నట్లు చెప్పారు. అంతేకాకుండా త్వరలోనే ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ భీమాతో ఆర్థికంగా ఆదుకోనుండగా, విద్య,ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వరి పంటతో పాటు రైతులు ఇతర పంటలపై దృష్టి పెట్టాలని, తద్వారా భూసారం కాపాడుకోవచ్చని స్పష్టం చేశారు. వాతావరణ సమతుల్యతలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, చెట్ల పెంపకంపై దృష్టి పెట్టాలని, ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం తగ్గించాలని సూచించారు. రోజురోజుకు పెరుగుతున్న డ్రగ్స్, మత్తు పదార్థాల సరఫరాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తద్వారా యువత, విద్యార్థులను కాపాడుకోవచ్చని చెప్పారు. జంట నగరాలకు వంటిమామిడి మార్కెట్ సమీపంలో ఉన్నందున రైతులు ఆరుతడి, కూరగాయల పంటల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ విద్యార్థులకు అందుబాటులోకి తేనుండగా, ప్రాథమిక స్థాయిలో అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాగా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేస్తుండగా, త్వరలోనే మరికొన్ని నూతన పథకాలు ప్రారంభించనున్నట్లు వివరించారు.

## పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

### జిల్లా పంచాయతీ అధికారి రవీందర్

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలకు చెందిన పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అలాగే గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టాలని, గ్రామపంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై పంచాయతీ కార్యదర్శులకు అవసరమైన మార్గదర్శకాలను అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పందిల్ల గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్ హుస్నాబాద్ మండలంలో నాటుసారా విక్రయాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. నాటుసారా విక్రయాలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ మండల పంచాయతీ అధికారి గుగులోతు మోహన్, అక్కన్నపేట మండల పంచాయతీ అధికారి శివ నాగేష్, కోహెడ మండల పంచాయతీ అధికారి రవీందర్ రెడ్డి తో పాటు మూడు మండలాలకు చెందిన పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫోటో/సిద్దిపేట-4 : రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటియు నాయకులు

నోయిడా కార్మికుల పోరాటానికి సీఐటియు మద్దతు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** నోయిడా, గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్ జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్)లో కార్మికులు చేస్తున్న పోరాటానికి సీఐటియూ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతూ గురువారం ఆ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటియూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, హర్యానాలో బిజెపి ప్రభుత్వాలు క్రూరంగా అణచివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి వారి హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలు వారి పోరాటాన్ని అణచివేస్తూ 400 మందికిపైగా కార్మికులను అరెస్టు చేశారని వివరించారు. ఇప్పటికైనా కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగర వెంకట్, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి జాలీగపు శిరీష, సిఐటియూ జిల్లా సహాయ చొప్పరి రవికుమార్, కార్యదర్శి మామిడాల కనకయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బత్తుల అభిషేక్ బాన్, రేణుక.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫొటొ/సిద్దిపేట-6 : బెజ్జంకి సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ఫొటొ/సిద్దిపేట-7 : నంగునూర్‌లో మాట్లాడుతున్న ఎఎంసి చైర్మన్ యాదగిరి తదితరులు

మండలాలలో మండల స్థాయి సమావేశాలు నిర్వహించిన అధికారులు

**బెజ్జంకి/తొగుట/నంగునూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపిడివో ప్రవీణ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలో చేపట్టిన కార్యక్రమాలు వాటి పురోగతిపై అన్ని శాఖల అధికారులను తమ నివేదికలను ప్రజలకు, యువకులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వారి అభిప్రాయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ ప్రత్యేక అధికారి పవన్, తహశీల్దార్ శ్రీకాంత్, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

**తొగుటలో...**

మండల కేంద్రంలో ఎంపిడివో కార్యాలయంలో గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మండల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తొగుట ఎఎంసి చైర్మన్ చెరుకు విజయ్‌రెడ్డి, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలు కోసం ప్రభుత్వం రూపొందించిన 99వ రోజుల ప్రణాళిక ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మీ, ఉచిత విద్యుత్ నిరుపేదలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొగుట మండల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించడంలో జిల్లాలోని మొదటి స్థానంలో నిలిచినందులకు ఎంపిడివో జి.నాగేశ్వర్, తహశీల్దార్ సమీర్ హైమదిఖాన్, ఎస్ఐ రవికాంత్, హౌసింగ్ ఏఈ వివేక్, అధికారులను సత్కారించారు. అనంతరం ఎఎంసి చైర్మన్, ఆత్మకమిటీ చైర్మన్‌ను సర్పంచ్‌లు సత్కారించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఎడి మల్లయ్య, ఎంపిడివో, సర్పంచ్‌లు,ఉపసర్పంచ్‌లు, అంగన్‌వాడీ టీచర్లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**నంగునూర్‌లో...**

గ్రామాల అభివృద్ధిలో గ్రామస్తుల భాగస్వామ్యం ఉండాలని ఎఎంసి చైర్మన్ దేవులపల్లి యాదగిరి, డిపిఓ రవీందర్‌లు అన్నారు. నంగునూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం ఎంపిడివో మహబూబ్ అలీ అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న పథకాలపై విస్తృత స్థాయి అవగాహన కల్పించడం ప్రజాపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం స్థానిక సమస్యలు అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించడం వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని వారి వారి శాఖల నివేదికలను చదివి వినిపించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి పథకాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఎంఈవో దేశిరెడ్డి, ఎపిఎం శ్రీనివాస్‌తో పాటు వివిధశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎంపిడిఓ

**మొగుడంపల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగిస్తోందని ఎంపిడిఓ మహేష్ అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మొగుడంపల్లిలోని రైతు వేదికలో మండలస్థాయి సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు తమ వంతు కృషి చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా పాలన సాగించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనులుచేస్తే సమస్యలు పరిష్కారంకావడంతోపాటు అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ ముబిన్ మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్, ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, ఏపీఎం టీఖ్యానాయక్, ఎంఈఓ జాఫర్‌అలీ, డిప్యూటీ తహసీల్దార్ జుబెర్, ఎంపీఓ సంజయ్ కుమార్, ఏఈ సతీష్ కుమార్, పశువైద్యాధికారరి సునీల్ దత్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అల్లాదుర్గంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక మండల సభ

**అల్లాదుర్గం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రమైన అల్లాదుర్గంలో మండలస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకున్న మండలంలో ఆయా గ్రామాల లబ్దిదారుల వివరాలను సభలో వివరించారు. కార్యక్రమంలో వట్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ లక్ష్మీ శేషారెడ్డి, మండల ప్రత్యేక అధికారి కరుణాకర్, సిఐ రేణుకరెడ్డి, ఎస్ఐ శంకర్, ఎంపిడిఓ చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి, ఎఓ రాజేష్‌కుమార్, ఎంపిఓ ప్రభాకర్, అల్లాదుర్గం సర్పంచ్ సౌమ్య సురేష్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు వీరన్న, శంకర్ నాయక్, రవి, మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో అరైవ్ అలైవ్ కార్యక్రమం

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాలను తగ్గించడం లక్ష్యంగా గురువారం హుస్నాబాద్‌లో పోలీసు, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.పట్టణంలోని అక్కన్నపేట రోడ్డుతోపాటు మల్లెచెట్టి చౌరస్తాలో జరిగిన ఈ కార్యక్రమంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హుస్నాబాద్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ యోగేశ్వర్‌సింగ్, ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరెడ్డి పాల్గొని వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. అతి వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందుకోసం హుస్నాబాద్‌లోని భద్రకాళి ఆప్టికల్స్ యాజమాన్యంతో మాట్లాడి డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించారు. కంటి సమస్యలు ఉన్న ఆటో డ్రైవర్లకు ఉచితంగా అద్దాలు అందజేయడంతో పాటు కంటి చుక్కల మందులను కూడా పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

## సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా అమలు చేయాలి

**-ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**

**కల్హేర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామస్థాయిలో సమర్ధవంతంగా అమలయ్యేలా అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. గురువారం కల్హేర్‌లోని రైతువేదికలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్, వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్య, ఏకేపిశాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియామాలు పాటించాలి : డిఎస్‌పి


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**నారాయణఖేడ్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియామాలు పాటించాలని డిఎస్‌పి వెంకటరెడ్డి అన్నారు. గురువారం అరైవ్ అలైవ్ ప్రజాపాలనలో భాగంగా నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా అందరి భాద్యత అన్నారు. డ్రైవర్లు విధి నిర్వహణలో అతి వేగం, నిరక్ష్య డ్రైవింగ్, సెల్‌ఫోన్ వినియోగం, మద్యం తాగి వాహనం నడపడం వంటి చర్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రతి బస్సు డిపో నుండి బయలుదేరే ముందు బ్రేకులు, టైర్లు, లైట్లు, హారన్, స్టీరింగ్ తదితర సాంకేతిక అంశాలను తనిఖీ చేసి రోడ్డుపైకి పంపాలని మెకానికల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన హైమాక్స్ లైట్లతో గ్రామాలకు వెలుగు

**మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్**


మున్సిపల్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ప్రజలు

**నారాయణఖేడ్, ఎప్రిల్ 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చప్తా (కే) దుర్గమ్మ తండా వద్ద నూతన హైమాక్స్ లైట్లను మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ ఆవిష్కరించారు. జహీరాబాద్ ఎంపీ సురేష్‌శెట్కార్ ప్రత్యేక నిధులతో మంజూరైన ఈ హైమాక్స్ లైట్లు గ్రామాల్లో అంధకారాన్ని పారద్రోలుతూ ప్రజలకు భద్రత, సౌకర్యం కల్పించనున్నాయి. ఈ సందర్భంగా చైర్మన్ నాగేష్ శెట్కార్ మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యమన్నారు. హైమాక్స్ లైట్ల ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎంపీ సురేష్ శెట్కార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాహిర్‌అలీ, కౌన్సిలర్లు వివేకానంద మహేందర్, లక్ష్మణ్, సర్పంచ్ మెత్రి సునీతమ్మ, ఉపసర్పంచ్ పారశెట్టి బస్వావరాజ్, మాజీ సర్పంచ్ గంగయ్యస్వామి, మాజీ ఉపసర్పంచ్ నారాయణ రెడ్డి, వార్డ్ మెంబర్లు నిర్మల పద్మాకర్, సంపూర్ణ పవన్, శేరికర్ నందు, లక్ష్మి సాయి గొండ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**మండల ప్రత్యేకాధికారి, మెదక్ డీఎల్పీఓ సురేష్ బాబు**


రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

**పాపన్నపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి, మెదక్ డీఎల్పీఓ సురేష్‌బాబు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం పాపన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మండలస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రగతి ప్రణాళికలో భాగంగా 99రోజుల కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలన్నారు. కొత్తగా అమలు చేసే పథకాల గురించి వివరించారు. అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత నియమాల గురించి వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీఓ విష్ణువర్ధన్, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికపై సమీక్ష

**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై మండల స్థాయిలో స్థానిక రైతు వేదికలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో క్రాంతికుమార్, తహసీల్దార్ ప్రభుదాసు ప్రభుత్వ పథకాల అమలుపై ఈ సమావేశంలో సమీక్షించారు. గ్రామస్థాయిలోనెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే తద్వారా సమస్య పరిష్కారమయ్యే వీలుందన్నారు. ఆయాశాఖల అధికారులు తమపరిధిలోని సంక్షేమ పథకాల అమలుపై క్షుణ్ణంగా వివరించారు. అనంతరం ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి ఈ సమావేశంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మే నెల రెండవ తేదీన నియోజకవర్గ స్థాయిలో, మే 22న జిల్లా స్థాయిలో, జూన్ రెండవ తేదీన రాష్ట్రస్థాయిలో సమీక్ష సమావేశాలు ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశ ఆవరణలో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ స్థాలును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగం కృష్ణ, వైద్యాధికారి షరీఫోద్దీన్, ఎంఈఓ శేఖర్, సూపరిండెంట్ షాకిర్ అలీ, ఆర్ఐ రమేష్ ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభుదాస్

# ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం

**టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి**

**కంది, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు అయితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం కందిలోని రైతువేదికలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. రైతులకు రుణమాఫీ, రైతుబీమా, ఇందిరమ్మ ఇళ్లు స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్‌కార్డులు, పాస్‌బుక్కులు, సన్నబియ్యం పంపిణీ వైద్యసేవలులాంటి అనేక సంక్షేమ పథకాలు అందు కుంటున్న లబ్దిదారుల వివరాలను వెల్లడించారు. అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత భీమా, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం విస్తరణలాంటి నూతన పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు చివరి కుటుంబం వరకు అందేలా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజా పాలన-ప్రగణి ప్రణాళికలో భాగంగా శానిటేషన్, ఆరోగ్య కార్యక్రమాలు, గ్రామసభలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. రబీ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలను పెంచి రైతులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటామని, అందుకు సర్పంచ్‌లు, ఎస్‌హెచ్‌జి మహిళలు సహకరించాలన్నారు. ఈజీఎస్ పథకంలో చేపట్టిన పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణం, గ్రామ పంచాయితీ, అంగన్‌వాడి భవనాల నిర్మాణాల పనులు రానున్న రెండు నెలల్లో పూర్తి చేయాలని అందుకు సర్పంచ్‌లు తమ వంతు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో డిఐసి జీఎం తుల్జా నాయక్, ఎంపిడిఓ శ్రీనివాస్, తహసీల్దార్ రవి కుమారర్, ఎంపిఓ మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మండల సమాఖ్య ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



హాస్పిటల్ ముందు బైఠాయించిన బంధువులు

## బీరంగూడ తిరుమల ఆసుపత్రి నిరక్ష్యం.. యువతి మృతి

**వైద్యులపై కేసు నమోదు చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన**

**అమీన్‌పూర్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** బీరంగూడలోని తిరుమల ఆసుపత్రిలో వైద్యుల నిరక్ష్యం కారణంగా ఓ యువతి మృతి చెందిన ఘటన కలకలం రేపింది. కడుపు నొప్పితో ఆసుపత్రికి వెళ్లిన యువతి ఆపరేషన్ సమయంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వందనపురి కాలనీకి చెందిన హారిక(28) కడుపు నొప్పితో బుధవారం బీరంగూడలోని తిరుమల ఆసుపత్రిలో చేరింది. వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆపరేషన్ చేయాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాత్రి 9 గంటల సమయంలో హారికను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లగా, కొద్దిసేపటికే మృతి చెందినట్లు ఆసుపత్రి సిబ్బంది ప్రకటించారు. వైద్యం వికటించడంతోనే హారిక మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కడుపు నొప్పికి సర్జరీ ఎందుకు చేశారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇదే ఆసుపత్రిలో ఇటీవల మరో వ్యక్తి వైద్యం వికటించి మృతిచెందగా, ఆసుపత్రి యాజమాన్యం లక్షల రూపాయలు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసినట్లు ఆరోపణలు చేశారు. హారిక మృతితో ఆమె కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యుల నిరక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కేసు నమోదు చేసి జైలుకు పంపాలని వారు డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఆసుపత్రి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. హారిక కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగుతుందని కుటుంబసభ్యులు హెచ్చరించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమీక్ష

**నార్సింగి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** నార్సింగి మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం రైతు వేదికలో ఇంచార్జి ఎంపీడీఓ చిన్నా రెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి నీలిమ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రభుత్వ అమలు చేస్తున్న, చేయబోయే పథకాల గురించి గణాంకాలతో సహ వివరించారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై సమావేశంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భోజన నమూనాలను అధికారులు ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు పౌష్టికాహారం అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వారానికి 3 రోజులు పాలు, 3 రోజులు రాగి మాల్ట్ పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందేలా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫొటో రైటప్ : 3. నర్సాపూర్ శివాలయంలో హిందూ సమ్మేళన కరపత్రాలను ఆవిష్కరించిన హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు

## 19న నర్సాపూర్‌లో హిందూ సమ్మేళనం

**నర్సాపూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** ఈనెల 19న హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 9గంటలకు నర్సాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి సభ్యులు ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ ఓంకార్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను నర్సాపూర్ శివాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతిస్వామి, ముఖ్య వక్త అప్పలప్రసాద్, మహిళావక్త శారదాదయానిధి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హిందు బంధువులు, ఆర్ఎస్ఎస్ నాయకులు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఓంకార్ యాదవ్ కోరారు. కార్యక్రమంలో హిందూ సమ్మేళన సమితి గౌరవ అధ్యక్షులు వీరప్ప గురుజీ, అధ్యక్షులు చెల్మేటి సంజీవ్, ఉపాధ్యక్షులు నరేష్ యాదవ్, కార్యదర్శి ప్రభాకర్ చారి, సభ్యులు ఆంజనేయులు, కొండ సుందర్, నాగరాజు, దేవా గౌడ్, ధన్ సింగ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు


కరపత్రాలను ఆవిష్కరించిన హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు


గ్రామస్తులకు రూ. 2 లక్షల ఉచిత బీమా సౌకర్యం కోసం సొంత డబ్బులతో ప్రీమీయం చెల్లిస్తున్న సర్పంచ్ కొర్పోల్ సుమతిశివకుమార్

## గ్రామస్తులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించిన సర్పంచ్

**నర్సాపూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నాగులపల్లి గ్రామ సర్పంచ్ కొర్పోల్ సుమతి శివకుమార్ సొంత డబ్బులతో గ్రామస్తులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించారు. సర్పంచ్ సుమతి శివకుమార్ జన్మదిన దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలోని పలువురికి సొంత డబ్బులతో ప్రీమియం చెల్లించి గ్రోమోర్ ఇన్సూరెన్స్ పాలసీని చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా గ్రామంలోని 50 సంవత్సరాలు నుంచి 64 సంవత్సరాల లోపు రైతులకు తన సొంత డబ్బులతో గ్రోమోర్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించడం జరిగిందన్నారు. ఈ పాలసీ చేయించుకున్న రైతులు ప్రమాదవశుత్తు మరణిస్తే 2 లక్షల బీమా వస్తుందని ఆమె తెలిపారు. సొంత డబ్బులతో గ్రామంలోని రైతులకు ఇన్సూరెన్స్ చేయించినందుకు గ్రామస్తులు సర్పంచ్ కొర్పోల్ సుమతి శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేగాక జన్మదిన సందర్భంగా సర్పంచ్ సుమతి శివకుమార్‌కు శాలువాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఇంద్రసేనారెడ్డి, రామ్‌రెడ్డి, జాన్ పాల్గొన్నారు

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరిక్షలు

**నారాయణఖేడ్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వారోత్సవాల సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ ఆధ్వర్యంలో నేత్రం హాస్పిటల్‌లో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగానే అందజేశారు. అదేవిధంగా కంటి ఆపరేషన్లు అవసరంఉన్నవారికి బోధన్ లైన్స్ హాస్పిటల్ పంపుతామని లైన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్ రెడ్డి, సిఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రీశైలం, లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ రాజ్ కుమార్, అధ్యక్షులు సాయి సంగమేశ్వర్ సభ్యులు వెంకట్రావు, చంద్రశేఖర్, పరమేశ్వర్, దశరథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 75 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ సహకారంతో నిర్వహిస్తామని డిఎస్పి వెంకటరెడ్డి అన్నారు.

## ఆక్రమణదారులకు వంతపాడుతున్న తహసీల్దార్

**బిజెపి మండల అధ్యక్షుడు**

**హత్నూర, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** ప్రభుత్వ భూములు కాపాడాల్సిన ప్రభుత్వ అధికారులు కంపెనీ యాజమాన్యాలతో కుమ్మక్కై భూములను ధారాదత్తం చేస్తున్నారని హత్నూర బీజేపీ మండల అధ్యక్షులు నాగప్రభు గౌడ్ ఆరోపించారు. గురువారం దౌల్తాబాద్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆరోపించారు. హత్నూర బోర్పట్ల గ్రామంలో ప్రాథమిక సహకార సంఘానికి కేటాయించిన 2 ఎకరాల భూమిలో అరబిందో తేరేనియం కంపెనీ వారి సరిహద్దు గోడను కూల్చి సహకార సంఘము భూమిలో అక్రమంగా దాదాపు 10 పిల్లర్స్ తో భారీ భవనం కట్టే ప్రయత్నం చేస్తుందని సహకార సంఘ సి.ఓ శ్రీనివాస్ తో, స్థానిక యువకులు బిజెపి నాయకులు హత్నూర ఎస్సై కి ఫిర్యాదు చేసి తహశీల్దార్ కు ఫిర్యాదు చేయడానికి వస్తె మిస్టైన్ కేసులు పెడతా అని బెదిరించారని, పూర్తిగా కంపెనీ యాజమాన్యాలతో అనుకూలంగా వ్యవహరిస్తున్న తీరు చాలా బాధాకరం అని ఆరోపించారు. గతంలో బోర్పట్ల నేరేటి కుంటలో కట్టిన ఎం బ్లాక్ ను సర్వే చేయడంలో తహశీల్దార్ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు స్థానిక బోర్పట్ల సర్పంచ్ అక్రమాలకు పాల్పడితే ఊరుకోబోమని తెలిజేశారు ఈ కార్యక్రమంలో బీజేపీ బోర్పట్ల నాయకులు తలారి మల్లేష్ పాటిమీది శ్రీశైలం రాకేష్ నరేష్ అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై హత్నూర తైసిల్దార్ ఫర్వీన్ షేక్ ను వివరణ కోరగా బిజెపి నాయకుల ఆరోపణలు చదివిన తర్వాతనే వివరణ ఇస్తానని అన్నారు


మాట్లాడుతున్న బిజెపి మండల అధ్యక్షులు నాగప్రభు గౌడ్

## ఏడుపాయల హుండీ ఆదాయం రూ. 52లక్షల 12 వేలు

**పాపన్నపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** ఏడుపాయల వనదుర్గ భవాని దేవి ఆలయ 56 రోజుల హుండీ ఆదాయం 52 లక్షల 12 వేల 171 రూపాయలు వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఏడుపాయల ఇన్‌చార్జ్ ఇఓ వీరేశం, ఇన్‌స్పెక్టర్ రంగారావు వెల్లడించారు. గురువారం ఏడుపాయల ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ అధ్వర్యంలో గోకుల్ షెడ్‌లో నిర్వహించగా ఇన్‌స్పెక్టర్ రంగారావు పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. బంగారం 0.24 మిల్లీ గ్రాము, వెండి 0.927 మిల్లీ గ్రాముల మిశ్రమవస్తువులతో పాటు నగదు రూపంలో 52 లక్షల 12 వేల 171 రూపాయల ఆదాయం ఏడుపాయల దేవాదాయ ధర్మాదాయ శాఖకు సమకూరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్యశ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ, యాదగిరి, బ్రహ్మచారి, రమేష్, శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొనగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### హుండీ లెక్కింపులో సిబ్బంది హాల్‌చల్

**ఇఓ గరం...గరం**

ధార్మికత ఉట్టిపడేలా హుందాగా విధులు చేపట్టాల్సిన ఓ జూనియర్ అసిస్టెంట్ మద్యం తాగి విధులు నిర్వర్తించడమేకాకుండా హుండీ లెక్కింపువద్ద హాల్‌చల్ చేయడంతో గందరగోళం ఏర్పడింది. అతిగా మద్యం తాగి హుండీ లెక్కింపు వద్ద గొడవ చేస్తుండడంతో ఆలయ కార్యనిర్వహణాధికారి, వీరేశం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు ఉన్నతాధికారుల ముందే హాల్‌చల్ చేయడంతో కార్యనిర్వహణాధికారి వీరేశం హుండీ లెక్కింపు కార్యక్రమానికి విచ్చేసి బందోబస్తు నిర్వర్తిస్తున్న పోలీసులను తీసుకెళ్లాలని ఆదేశించడంతో వారు మద్యం మత్తులో వున్న జూనియర్ అసిస్టెంట్‌ను నచ్చజెప్పి బయటకు పంపే ప్రయత్నం చేయగా ససేమిరా అంటూ భీష్మించి కూర్చున్నాడు. దీంతో ఆలయ అధికారులు బ్రీత్‌అనలైజర్ మిషన్ వెయ్యాలని సూచించడంతో శాంతించిన అతను పోలీసుల వెంట బయటకు వెళ్లాడు.


హుండీని లెక్కిస్తున్న సిబ్బంది


మాట్లాడుతున్న ఎంపిడివో మహేశ్వరరావు

## గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి : ఎంపిడివో

**నాగల్‌గిద్ద, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎంపిడిఓ మహేశ్వరరావు అన్నారు. నాగల్‌గిద్దలో గురువారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనులు చేసుకుంటూ పరిష్కరించుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యనరకమంలో అధికారులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి

**-మండల ప్రత్యేక అధికారి వసంత కుమారి**


మాట్లాడుతున్న వసంత కుమారి

**చౌటకూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ప్రభుత్వం సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి వసంతకుమారి సూచించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మండల కేంద్రమైన కంగ్టిలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వహించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. మండలంలో సంక్షేమ పథకాలను అందుకుంటున్న లబ్ధిదారుల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నామాల కిష్టయ్య, ఎస్ఐ నల్లా విశ్వజన్, ఎంపిఓ సువర్ణ, ఏఈఓ ప్రవీణ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నాగసాయి, విద్యుత్ ఏఈ సాయి రాఘవ, ఐసీడిఎస్ పర్యవేక్షకురాలు అమృతవాణి, మోహన్‌రెడ్డి, ఐకెపి సీసీ చంద్రశేఖర్, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులతో పేదలు ప్రయోజనం పొందాలి

**-మండల ప్రత్యేక అధికారి నూతన్‌కుమార్**



మాట్లాడుతున్న నూతన్‌కుమార్

**కంగ్టి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను కార్యదర్శులతోపాటు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు సక్రమంగా అమలయ్యేలా చేస్తూ పేదలు ప్రయోజనం పొందేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి నూతన్‌కుమార్ అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం కంగ్టిలోని బస్వ ప్రదీప్ ఫంక్షన్ హాల్‌లో మండలస్థాయి సమావేశం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని బోర్గి, గాజులపాడు, చౌకన్‌పల్లి, దెగులవాడ తదితర గ్రామాల్లో పనులు చురుకుగా కొనసాగుతున్నట్లు గుర్తుచేశారు. మండలంలో 4993 మంది చేయూత పింఛన్లు అందుకుంటున్నారని గుర్తుచేశారు. సర్పంచ్‌లు, అధికారులు సమన్వయంతో పనులుచేస్తే అభివృద్ధి తథ్యమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, వ్యవసాయ అధికారి, డిఎల్‌పిఓ ఎంపిఓ గంగాభవాని, హరీష్‌పవర్, సంజీవ్, లక్ష్మణ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**అధికారులను నిలదీసిన ప్రజలు...**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం కంగ్టిలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ప్రజలు అధికారులపై తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ నిలదీశారు. ఆశ వర్కర్ విధులకు సక్రమంగా హాజరు కావడంలేదని రాంతీర్థ గ్రామ సర్పంచ్ లలితగణేష్ పిహెచ్‌సి వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. విద్యా వ్యవస్థ కుంటుపడుతోందని కంగ్టి సర్పంచ్ కృష్ణ ముదిరాజ్ విచారం వ్యక్తంచేశారు. తాగడానికి మిషన్‌భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని రేగడి తండా సర్పంచ్ తనయుడు బలిరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ తాండలో రోడ్లు లేవని జిల్లా గిరిజన ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రాథోడ్ రాంసింగ్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.

## వర్కారి భక్తులకు దుస్తుల పంపిణీ.

**నారాయణఖేడ్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** పట్టణంలోని మంగల్పేట హనుమాన్ మందిర్‌లో ఏకాదశి సందర్భంగా వర్కారి భక్తులకు దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ భక్తులకు దుస్తులు అందజేశారు. విటలేశ్వర ఆలయంలో సిద్ధంగా ఉంచిన దుస్తులను సాంప్రదాయబద్ధంగా వర్కారి భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కరణ్ గజేంద్రమహారాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతనలో నడవాలని, అలా చేస్తే మనశ్శాంతి కలుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి.ఎస్. వీరశెట్టి, శంకర్ సెట్‌కార్, రామకృష్ణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళన మండల కమిటీ ఏర్పాటు

**మనూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** మండల హిందూ సమ్మేళన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా కులకర్ణి సతీష్ రావు(మనూర్), ఉపాధ్యక్షులుగా గొల్ల బీరప్ప(మాయికోడ్), కృష్ణ(పులకుర్తి), విశ్వనాథ్(బాదల్‌గావ్), ప్రధాన కార్యదర్శులుగా బైండ్ల రవి(బోరంచ), రాకేష్‌రెడ్డి(బెల్లాపూర్), ఉప కార్యదర్శిగా రమేష్ స్వామి (డవ్వూర్), ప్రవీణ్ (తుమ్నూర్), నరేష్‌రెడ్డి (దుద్దగొండ), కోశాధికారిగా భూపాల్‌రెడ్డి (మనూర్), జూపాల్ (డవ్వూర్), కార్యనిర్వాహక సభ్యులుగా శివరాజ్, దత్తు, అంజి, తదితర 325 మందిని ఎన్నుకున్నారు.

**26న హిందూ సమ్మేళనం...**

ఈ నెల 26న మనూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాయంత్రం 4 గంటల నుంచి హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు సతీష్‌రావుకులకర్ణి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రతి ఇంటి నుంచి హిందువులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి హిందూవుల ఐక్యతను చాటాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి చేరుకున్న వారికి అన్నదాన వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

## జాబ్ మేళాకు అపూర్వ స్పందన - 35 మందికి ఉద్యోగాలు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో నిర్వహించిన జాబ్‌మేళాకు నిరుద్యోగ యువత నుంచి అపూర్వ స్పందన లభించినట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపారు. కళాశాల టిఎస్‌కెసి, టాస్క్, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో, కోవలెంట్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఈ జాబ్‌మేళా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి 80 మందికిపైగా నిరుద్యోగ యువత హాజరుకాగా, అందులో 35 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు. విద్యార్థులకు విద్యతోపాటు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో వివిధ సంస్థల సహకారంతో ఇటువంటి జాబ్ మేళాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కళాశాల విద్యార్థులతో పాటు ఇతర నిరుద్యోగులకు అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ సంస్థల సహకారంతో ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు జాబ్‌మేళాలను కొనసాగిస్తామని ఆమె చెప్పారు. తెలంగాణ లో ప్రముఖ విద్యాసంస్థలలో తారా ప్రభుత్వ కళాశాల ఒకటిగా నిలుస్తూ, విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ వినోద్, టి.ఎస్.కే.సి కన్వీనర్ డాక్టర్ సుచిత్ర సింగ్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వాణి, టాస్క్ అధికారులు శ్రీనివాస్, మానస్, కోవలెంట్ లాబొరేటరీస్ ప్రతినిధులు మహేష్ రెడ్డి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.